క్లుప్తంగా

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

తాళ్లపూడి: మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేగేశ్వరపురం గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలు సంకాబత్తుల శ్రీదేవికి వైద్య ఖర్చుల నిమిత్తం సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మానవత అధ్యక్షుడు సురేష్ చేతుల మీదుగా రూ.6 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రతినిధులు వి.చంద్రయ్య, జి.వెంకటేశ్వరరావు, సనపల రాజశేఖర్, గెడ్డం సాయి బాబా, వెంకటేష్, అప్పన హనుమంతరావు, తిగిరిపల్లి దోసాలు, పెమ్మాడి దుర్గాప్రసాద్, సాయన సుబ్బారావు, దుగ్గిరాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి...



యర్నగూడెంలో రవీంద్రకు ఆర్థిక సాయం మానవత సంస్థ సభ్యులు

దేవరపల్లి: యర్నగూడెంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బిరుదుగడ్డ రవీంద్రకు మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. సోమవారం బాధితుడు రవీంద్రను పరామర్శించి సొమ్మును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బళ్ల సూర్యచక్రం, బండి సూర్యప్రకాశరావు, కేశిరాజు వెంకటరాజ్‌కుమార్, యలమాటి సత్యనారాయణ, తీగెల రాజా, పప్పు వెంకటరామారావు పాల్గొన్నారు.

నేడు సామూహిక కుంకుమ పూజలు

కొవ్వూరు: శ్రావణ మాసం సందర్భంగా పట్టణంలో సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఈ పూజలు ప్రారంభమవుతాయన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వే స్టేషన్‌లోని 4, 5 ప్లాట్‌ఫాంకు వెళ్లే ఫ్రంట్ ఓవర్ బ్రిడ్జి మెట్లపై సుమారు 45 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని జీఆర్పీ ఎస్సై మావుళ్లు సోమవారం తెలిపారు. మృతుడు సుమారు 5.6 అడుగుల పొడవు ఉండి నలుపు రంగులో కలిగి ఉన్నాడన్నారు. ఒంటిపై నలుపు రంగు డిజైన్ గల పొడవు చేతుల చొక్కా, లైట్ బ్రౌన్ కలర్ పొడుగు నిక్కర్, లుంగీ ధరించి ఉన్నాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అతడి వివరాలు తెలిసిన వారు 94910 03239, 0883 2442821 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

కంబాలచెరువు: నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లలో సోమవారం వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇమేజింగ్, ఫణీంద్ర స్కానింగ్, జాగ్రుతి డయాగ్నోస్టిక్ సెంటర్లను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబు, సిబ్బంది పరిశీలించారు. వీటిలో ధరల పట్టిక లేకపోవడం, రికార్డులు సక్రమంగా లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు.

మణికుమార్‌కు అంబేడ్కర్ అవార్డు



అంబేడ్కర్ అవార్డు అందుకుంటున్న మణికుమార్

రాజానగరం: రక్తదానం ద్వారా ఎందరికో ప్రాణదానం చేస్తూ, సమాజంలో సేవాభావంతో పయనిస్తున్న కొండగుంటూరుకు చెందిన పెంటగట్ల మణికుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు లభించింది. విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు ఫంక్షన్ హాలులో మదర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకున్నారు. మణికుమార్ ఇంతవరకు 36 సార్లు రక్తదానం చేశారు.

అన్నదానం మహోన్నతం

రాజమహేంద్రవరం రూరల్: అన్నదానం మహోన్నతమైనదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శాటిలైట్‌సిటీలోని మానవీయ ఐక్యసేవ అసోసియేషన్ ఆశ్రమంలో తానేటి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జక్కంపూడి రాజా మాట్లాడుతూ వృద్ధాశ్రమం పరిస్థితిని చూస్తే మనసు చలిస్తోందని, జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా దీని అభివృద్ధికి కొంత ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. రాయుడు కాక, కోడి కోట, తలుపులు, దాసరి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ పీఎస్ నరేష్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పనుల నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. దానిలో భాగంగా మంగళవారం నుంచి సామాజిక తనిఖీలు జరుగుతున్నాయన్నారు.



కోల్‌కతా ఘటన దారుణం

ప్రజల ఆరోగ్యాలను బాగుచేస్తూ వారి శ్రేయస్సు కోసం తపించే వైద్యులకు రక్షణ లేకపోవడం దురదృష్టకరం. కోల్‌కతా ఘటన మరోసారి ఎక్కడా జరగకూడదంటే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పించాలి. పోలీస్ సిబ్బంది ఆస్పత్రుల వద్ద రాత్రి వేళ గస్తీ నిర్వహించాలి. అప్పుడు కొద్దిగా వైద్య సిబ్బందికి రక్షణ కలుగుతుంది. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ ఎం.శివాజీ, పీహెచ్‌సీ వైద్యులు, సమిశ్రగూడెం, నిడదవోలు రూరల్



వైద్యులకు రక్షణ కల్పించాలి



వైద్యులకు రక్షణ కల్పించాలి. ఇటీవల వైద్యులపై దాడులు జరుగుతున్నాయి. ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులపై దాడులు నిర్వహించడం దారుణం. కోల్‌కతాలో మహిళా వైద్యులపై అత్యాచారం చేసి హత్య చేయడం సిగ్గుచేటు. ఆసుపత్రి స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించి చర్యలు తీసుకోవాలి. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ డి.సాంబశివరావు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, దేవరపల్లి

అడుగు పడేదెలా

- గోతులమయంగా మారిన నిడదవోలు–పంగిడి రహదారి
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

చాగల్లు: నిత్యం రద్దీగా ఉండే నిడదవోలు–పంగిడి ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. 12 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డుపై రాళ్లు పైకి లేచిపోయి అధ్వానంగా తయారైంది. ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత గోతులుగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గోతుల్లో వర్షపు నీరు చేరడంతో తెలీయక వెళ్లి చాలా మంది ప్రయాణికుల గాయాలపాలయ్యారు. తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇటీవల నిడదవోలు పంగిడి రహదారికి చేపట్టిన మరమ్మతు పనుల్లో నాణ్యత లోపించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు పడిన గోతుల్లో తాత్కలికంగా మరమ్మతులు చేస్తున్నారని, అవి నెల రోజులకే షరా మాములుగా మారుతున్నాయని చెబుతున్నారు. ప్రధానంగా సిమెంట్ రోడ్డు, బీటీ రోడ్డు కలయకల వద్ద గోతులు మరింత పెద్దగా ఉన్నాయి. ఇటీవల చాగల్లు శివారులో జూనియర్ కళాశాల వద్ద జరిగిన ప్రమాదంలో భార్య భర్త ప్రమాదానికి గురై తీవ్ర గాయలపాలయ్యారు. బ్రాహ్మణగూడెం వద్ద జరిగిన ప్రమాదంలో చిడిపి గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రహదారిలో బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం, మీనానగరం, చాగల్లు, ఊనగట్ల, గ్రామాల్లో ఏర్పడ్డ గోతులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు తాత్కలికంగా కాకుండా పూర్తి స్థాయిలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ డీఈ డీవీరమణ వివరణ కోరగా నిడదవోలు, పంగిడి రహదారులలో ఏర్పడిన గోతులను పూడ్చే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రెండు నెలల క్రితం అక్కడ పడిన గోతులకు ప్యాచ్ వర్క్ చేయించామని, ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ కొన్ని చోట్ల గోతులు పడ్డాయని తెలిపారు. వాటికి మరమ్మతులు చేయిస్తామన్నారు.

గోతులు పూడ్చండి



నిడదవోలు, పంగిడి రహదారుల్లో గోతులమయం కావడంతో తరచుగా వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా సిమెంట్ రోడ్డుకి చివరల్లో పెద్ద పెద్ద గోతులు పడడంతో ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడిపోతున్నారు. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో గోతులు కన్పించకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని గోతులను పూడ్చాలి.

– పి.లక్ష్మణరావు, బ్రాహ్మణగూడెం, చాగల్లు



చాగల్లు వద్ద రోడ్డుపై పడిన గుంత



ఎస్.ముప్పవరం శివారులో గొయ్యి

ధ్వంసమైన యర్నగూడెం–పొంగుటూరు రోడ్డు

దేవరపల్లి: దేవరపల్లి మండలంలోని యర్నగూడెం నుంచి కొయ్యలగూడెం మండలం పొంగుటురు వరకు ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైయింది. యర్నగూడెం నుంచి పొంగుటూరు వరకు సుమారు 15 కిలో మీటర్ల రహదారి నరకప్రాయంగా ఉంది. ఈ రహదారిని 2016–17లో సుమారు రూ.15 కోట్ల వ్యయంతో నిర్మాణం చేశారు. అప్పట్లో దేవరపల్లి–తల్లాడ జాతీయ రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో భారీ వాహనాలను కొయ్యలగూడెం వద్ద పొంగుటూరు, యర్నగూడెం మీదుగా గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిపైకి మళ్లించారు. భారీ వాహనాల రాకపోకలకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైయింది. దీంతో రోడ్డుపై ప్రయాణం ఇబ్బంది కరంగా మారింది. అయితే అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. అయినా రోడ్డు ఎక్కడకక్కడ ధ్వంసం కావడంతో పూర్తిగా మట్టిరోడ్డుగా తయారైయింది. వర్షాకాలంలో ప్రయాణికులు నానావస్థలు పడుతున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రోడ్డు దుస్థితిని పరిశీలించి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిడదవోలు–పంగిడి రహదారిలో బ్రాహ్మణగూడెం సెంటర్‌లో ఛిద్రమైన రహదారి



యర్నగూడెం–పొంగుటూరు రోడ్డు దుస్థితి

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం



కొవ్వూరు టోల్‌గేట్ జంక్షన్ వద్ద మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



పల్లంట్లలో వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ



ప్రభుత్వ ఆసుపత్రిలో థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

కొవ్వూరు: మదర్ థెరిసా సేవా భావాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం పట్టణంలో శ్రీనివాసపురం టోల్‌గేట్ జంక్షన్ వద్ద మదర్ థెరిసా ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా 114వ జయంతిని నిర్వహించారు. ఆమె విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి,కంఠమణి రామకృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమకు ప్రతిరూపం

దేవరపల్లి: మదర్ థెరిసా జన్మదిన వేడుకలను సోమవారం పలు స్వచ్ఛంద సంస్థలు ఘనంగా నిర్వహించారు. పల్లంట్లలో మదర్ థెరిసా హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా జయంతిని నిర్వహించారు. మదర్ థెరిసా విగ్రహానికి మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ పూలమాల వేశారు. 50 మంది వృద్ధులకు దుప్పట్లు, మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ డేవిడ్, పార్డ్ ఇండియా మండల కార్యదర్శి వెంకట్రావు, నిర్వాహకులు శివరామకృష్ణ, మానవత సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో..

నిడదవోలు: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. థెరిసా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ జానకిప్రియ, ఏఎన్ఎంలు బి.నాగమణి, హెప్సిబా, రత్నకుమారి, సూర్యకుమారి, ఆలి, సురేష్, మోహన్, అలి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగమూర్తి మదర్ థెరిసా

నిడదవోలు రూరల్: తోటి వారికి సాయం చేయడానికి తన వ్యక్తిగత జీవితాన్ని త్యజించిన త్యాగమూర్తి మదర్ థెరిసా అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. మండలంలోని సమిశ్రగూడెం శాంతిసెంటర్‌లో మదర్‌థెరిసా జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మదర్ థెరిసా వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా తీసుకుని అందరూ తోటివారిని ప్రేమించాలన్నారు. అనంతరం మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళుర్పించారు. రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, స్థానిక నాయకులు

కచ్చితమైన తూకంతో బియ్యం తీసుకోవాలి

తూనికల, కొలతల శాఖ అధికారి ప్రసాద్



దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎలక్ట్రానిక్ కాటాలకు తనిఖీ చేస్తున్న జీవీ ప్రసాద్

దేవరపల్లి: గోడౌన్ల నుంచి కచ్చితమైన తూకాలతో రేషన్ సరకులు తీసుకోవాలని తూనికల, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ రేషన్ డీలర్లకు సూచించారు. మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తనిఖీలు చేసి 2024–25 సంవత్సరానికి సీలు వేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్ మాట్లాడుతూ కాటాలకు తప్పనిసరిగా సీలు వేయించుకోవాలన్నారు. సీలు లేకుండా వినియోగదారులకు కాటాలపై సరకులను పంపిణీ చేయడం నేరమని ఆయన అన్నారు. కార్డుదారులకు కచ్చితమైన తూకంతో నిత్యావసర సరకులు అందించాలన్నారు. దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లోని రేషన్ షాపులు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద గల కాటాలకు ఆయన సీళ్లు వేయించారు. మంగళవారం గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లో తనిఖీ చేస్తామని ఆయన తెలిపారు.

జక్కంపూడి రాజాను కలిసిన కృష్ణారెడ్డి



జక్కంపూడి రాజాను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

పెదపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన రాజానగరం మాజీ ఎమ్మెల్యే, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజాను అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరంలోని రాజా స్వగృహంలో సబ్బెళ్ల కృష్ణారెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, జిల్లా ఎస్సీ సెల్ ప్రతినిధి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, అనపర్తి ఎంపీటీసీ కొండేటి భీమేష్ తదితరులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

దేవరపల్లి: మండలంలోని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవరపల్లిలోని శ్రీరాధాగోపీనాథ్ మందిరం వద్ద కృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా జరిగాయి. అన్నసమారాధన నిర్వహించారు. రాత్రికి ఉట్టి కొట్టే కార్యక్రమం వైభవంగా జరిగింది.

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత మధనగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు. స్వామివారిని వివిధ పుష్పాలు, తులసీ దళాలతో అలంకరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. అన్నదేవరపేటలోని బీసీ కాలనీలో, గజ్జరంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. వడ్డీల రామాలయం వద్ద యువకులు ఉట్టి కొట్టారు. ప్రక్కిలంకలోని రావిపాటి ఫంక్షన్ హాల్ వద్ద రాజమండ్రి ఇస్కాన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: మండలంలో వివిధ గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. అనంతపల్లి, సుభద్రపాలెం, నల్లజర్లలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ గ్రామాలలో ఉట్టికొట్టే కార్యక్రమాలు జరిగాయి.

పట్టణ వీధుల్లో శ్రీకృష్ణ నామ సంకీర్తన

కొవ్వూరు: పట్టణ వీధులు కృష్ణ నామ సంకీర్తనలతో మార్మోగాయి. శ్రీకృష్ణ జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీరామానంద గౌడీయ మఠం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం పట్టణంలో నగర సంకీర్తన నిర్వహించారు. ఇది మఠం నుంచి ప్రారంభమైన ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి రోడ్డు మీదుగా మెయిన్‌రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం, రౌండ్ పార్కు, లాయర్స్ కాలనీ, వేణుగోపాల స్వామి గుడి వరకూ సాగింది. ఈ సందర్భంగా కోలాట నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



శ్రీకృష్ణుని వేషధారణలో అంధ విద్యార్థులు అనన్య, రోహిత్

హృదయాలయంలో...

నిడదవోలు: స్థానిక మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రం(హృదయాలయం)లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పుట్టుకతో మానసిక దివ్యాంగులు అంధులైన అనన్య, రోహిత్‌లు కృష్ణుడు వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు దండే గణేష్, విశాలాక్షి పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: మండలంలో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో మండలంలో తాడిపర్రు, మోర్త, వడ్లూరు గ్రామాల్లో కృష్ణుడు విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నాయి. సాయంత్రం గుడి వద్ద ఉట్టికొట్టారు.



కొవ్వూరులో నగర సంకీర్తన చేస్తున్న శ్రీరామానంద గౌడీయ మఠం సభ్యులు, శ్రీకృష్ణ భక్తులు



కొవ్వూరులో కోలాట నృత్యం చేస్తున్న కళాకారులు



తాళ్లపూడిలో ప్రత్యేకాలంకరణలో మధనగోపాల స్వామి



తాడిపర్రులో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీకృష్ణుడి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

గోదావరి తీరంలో మార్మోగిన వేదనాదం

సీటీఆర్ఐ: వేదనాదంతో గోదావరితీరం మార్మోగింది. ఏటా శ్రావణమాసంలో ప్రముఖ పరిషత్తులు, ట్రస్టులు నిర్వహించే వేదసభలకు రంగం సిద్ధమైంది. దీనిలో భాగంగా నగరంలో పలుచోట్ల సోమవారం వేదసభలను ఘనంగా నిర్వహించారు.

వేదశాస్త్ర పరిషత్తు ఆధ్వర్యంలో..

వేదశాస్త్ర పరిషత్తు 88వ వార్షిక వేదసభ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో నిర్వహించారు. పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాల ప్రదానం, పండిత సత్కారం జరిగాయి. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్టు ఆఫీసర్ ఎవీఎస్ఎస్. విభీషణశర్మ, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఎస్వీ నరసింహ కిషోర్, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

బులుసువారి వేదసభ

కళాగౌతమి ఆధ్వర్యంలో డాక్టర్ బీవీఎస్ మూర్తి నిర్వహించే వేదసభను మధ్యాహ్నం ఒంటి గంటకు గౌతమ ఘాట్‌లోని జగద్గురుపీఠంలో నిర్వహించారు. వేద పండితులను, వేద విద్యార్థులను నిర్వాహకుడు బీవీఎస్ మూర్తి సత్కరించారు.

విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి ట్రస్టు ఆధ్వర్యంలో..

భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి పేరిట ఆయన తనయుడు, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ ఏటా నిర్వహించే వేదసభ సాయంత్రం 6 గంటలకు గోదావరి గట్టున ఉన్న శృంగేరీ శారదా శంకర మఠంలో నిర్వహించారు. పలువురు వేదపండితులు పాల్గొన్నారు.